# మాబడి

పిల్లల పత్రిక

SCHOOL MAGAZINE

MONTHLY

*JANUARY'20*






జాతీయ బాలికా దినోత్సవం

बेटी बचाओ
बेटी पढ़ाओ

బేటి బచావో బేటి పడావో లోగో







జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం -ప్రచురణలు

# ప్రముఖుల సందేశం



"అందరికీ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఒక ప్రభుత్వ పాఠశాల నుండి 'మాబడి' మాస పత్రిక ప్రారంభం కావడం ఏంతో గర్వకారణం. వివిధ జిల్లాల టీచర్లను, పిల్లలను భాగస్వాములను చేయడం హర్షదాయకం. దీనికొరకు కృషిచేస్తున్న అందరికీ నా అభినందనలు. మనందరం దీనిని పిల్లలందరికీ అందేలా చేయాలి."

– శ్రీ అజయ్ సింగ్ SA, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు



"మిత్రులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 'మాబడి' మాస పత్రికను ఒక ప్రభుత్వ పాఠశాల వారు నిర్వహించడం అనేది మనందరం హర్షించదగిన విషయం. ఇందులో అన్ని అంశాలకు ప్రాధాన్యమివ్వడం జరిగింది. పత్రికను నడపడమంటే సామాన్య విషయం కాదు. మనం మన పాఠశాలల్లో చదివే ప్రతి ఒక్కరికీ అందేట్లు చేస్తే బావుంటుందని నా అభిప్రాయం"

– శ్రీ Y.వెంకట్ రెడ్డి SA, తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక రచయిత



"మాబడి" మాసపత్రిక నాకు చాలా బాగా నచ్చింది. దీని వెనుక ఎంత కఠోర శ్రమ వుంటుందో నాకు తెలుసు. దీనికోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులందరికీ నా అభినందనలు. ముఖ్యంగా ప్రభుత్వ బడులలోని పిల్లలకు అందించాలనే ఉద్దేశ్యంతో వెలువడుతున్న పత్రికకు మనందరం మనవంతు సహకారం అందిస్తే ఈ పత్రిక ప్రతి ఒక్కరికీ చేరుతుంది."

– శ్రీ సుధాకరాచారి SA, తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక చిత్రకారుడు.

# మాబడి

పిల్లల పత్రిక

SCHOOL MAGAZINE

సంపుటి:1 మాసపత్రిక సంచిక: 6

పేజీలు : 29 వెల : ఉచితం


## సంపాదకులు




**ఆకు(ఆదిత్య కుమార్),** స్కూల్ అసిస్టెంట్

జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా


## గౌరవ సంపాదకులు






సి.హెచ్.లత, ప్రధానోపాధ్యాయురాలు,

జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా

వి.వేణుగోపాల్ రాజు, స్కూల్ అసిస్టెంట్

జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా


*Best compliments from*

*సర్పంచ్.శ్రీ.దండా పుల్లయ్య గారు మరియు SMC వైస్ చైర్మన్ డి.ఉపేందర్ గారు*

**జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం - ప్రచురణలు**

# లోపలి పేజీల్లో

## ఈ నెలలో.......


- ✓ మా బడి గురించి...
- ✓ వింత ప్రపంచం
- ✓ నేనెవరో తెలుసా!
- ✓ మీకు తెలుసా?
- ✓ నింపండి-గెలవండి
- ✓ నేను గీసిన బొమ్మ
- ✓ हिंदी चुटकुले
- ✓ ఈ నెలలో మా బడిలో.....
- ✓ ఎవరు కనుగొన్నారో తెలుసా!
- ✓ నేను చేసిన ప్రయోగం
- ✓ సులభంగా గణితం నేర్చుకుందాం
- ✓ అద్భుత యంత్రం
- ✓ బొమ్మలు వేయడం ఎలా?
- ✓ గణిత శాస్త్రవేత్తలు – సేవలు
- ✓ తెలుసుకుందామా!
- ✓ స్పెషల్ స్టోరీ
- ✓ ఈ నెలలో పుట్టిన నేను పెద్దయ్యాక..
- ✓ ఇంగ్లీషు లో మాట్లాడదాం రండి.
- ✓ కవితలు రాద్దాం రండి
- ✓ పదాలు పలుకుదాం ఇలా...
- ✓ కథ చెప్పుతా .. ఊ కొడతావా...
- ✓ మెదడుకు మేత
- ✓ స్టూడెంట్ కార్నర్


చూశారా ఫ్రెండ్స్, ఎన్ని ఉన్నాయో కదా! ఇవన్నీ మీరందరూ తప్పక చదవండి. చదువుతారు కదూ!

ఇది మీ పత్రిక. మీ కోసమే రాయబడుతున్న పత్రిక.

నెల నెలా పత్రిక ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తారని ఆశిస్తూ....

ఇక చదవండి.....

# సంపాదకీయం

## హాయ్ ఫ్రెండ్స్!

అందరూ బావున్నారా! ముందుగా అందరికీ ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు. డిసెంబర్ నెలలో మనందరం ఏంతో ఉత్సాహంగా ఆకాశంలో ఏర్పడ్డ అద్భుతాన్ని చూశాం కదా..., అదేనండీ.. ఈ ఏడాదిలో మూడోది మరియు చిట్టచివరిదైన సూర్యగ్రహణాన్ని డిసెంబరు 26(గురువారం)నాడు చూశాం కదా. ఈ సంపూర్ణ సూర్యగ్రహణం.. ఉదయం 8 గంటల 9 నిమిషాలకు ప్రారంభమై ఉదయం 11:11 నిమిషాలకు ముగిసింది. మొత్తం పుణ్యకాల(గ్రహణ) సమయం మూడు గంటల రెండు నిమిషాలు. ఈ గ్రహణాన్ని మనదేశం అంతటా ప్రత్యేక కళ్ళద్దాలతో అందరం చూశాం. ఇటువంటి అద్భుతాన్ని చూడడం ద్వారా ఎంతో ఆనందాన్ని పొందాం.

అలాగే మొట్టమొదటి "ప్రపంచ నవ్వుల దినోత్సవం" 1998 జనవరి 11 న మన దేశంలోని ముంబైలో జరిగింది. స్థానిక మరియు అంతర్జాతీయ లాఫర్ క్లబ్‌ల నుండి 12,000 మంది సభ్యులు ఈ గొప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు. నవ్వు కోపానికి విరుగుడు, అనేక రోగాలను దూరం చేసే మంచి టానిక్. దీనికి మించిన వ్యాయామం లేదు. శారీరకంగానూ, మానసికంగానూ ఎంతో ఆరోగ్యాన్నిచ్చి, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేలా చేసేది నవ్వు. నిజానికి ఇది ఒక గొప్ప ఔషధం. ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరికైనా ఇది ఇచ్చే ఫలితం మాత్రం మారదు. అంతేకాదు నవ్వు పిరికితనాన్ని కూడా పోగొడుతుంది. నవ్వడం వలన శరీరంలోనున్న రోగాలన్నీ మటుమాయమవుతాయని ఆరోగ్యనిపుణులు అంటున్నారు.

అలాగే మన దేశంలో గణతంత్ర దినోత్సవాన్ని(రిపబ్లిక్ డే) మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 కి గౌరవంగా ప్రతిసంవత్సరం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా మనందరం మన దేశం కోసం సేవ చేద్దామనే ప్రతిజ్ఞ చేద్దాం.

ఎన్నో వైవిధ్యమైన జీవులకు నిలయం మన ఈ భూ గ్రహం. ఈ భూమి మీద పుట్టినందుకు వాటన్నింటినీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన వుంది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి 10న "SAVE THE EAGLES DAY" ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. దయచేసి మనందరం ఈ భువి పైన వున్న జీవజాతులను కాపాడుకుందాం.

ఫ్రెండ్స్ మీకు ఇవన్నీ చెప్పి బోరుకొట్టించానా! **గత నెల నుండి మీ కోసం కొన్ని పేజీలను కేటాయించాను . మీరు రచనలతో సిద్ధంగా వుండండి. ఈ పత్రికను చదివిన చాలామంది తమ రచనలకు అవకాశం ఇవ్వమని కోరుతున్నారు. తప్పక వారి కోరిక నెరవేరుతుంది. ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వడం జరుగుతుంది. ఇది మీ పత్రిక. మీకోసమే రాయబడుతున్న పత్రిక.**

ఈ పుస్తకాన్ని మీ ముందుకు తీసుకు రావడంలో సహాయ పడిన శ్రేయోభిలాషులకు, రచయితలకు జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

మీకు ఎంతో కొంత ఉపయోగపడుతుందనే నమ్మకంతో..........

**మీ**



ఆకు

# మా బడి గురించి .........





సహృదయులందరికీ నమస్కారములు,

ముందుగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రతి నెలా మాబడి నుండి విడుదలౌతున్న 'మాబడి' మాసపత్రికకు నెలనెలా ఆదరణ పెరగడం మాకెంతో ఆనందాన్నిస్తుంది. కాకపోతే మన ఉపాధ్యాయులకు ట్రైనింగ్ లు ఉండటంవల్ల పిల్లలకు అందడంలో కొంత ఇబ్బంది కలిగింది. అయినాకూడా చాలా మంది ఉపాధ్యాయులు పిల్లలకు అందించడానికి వారి వారి ప్రయత్నాలు చేసారు. వారికి నా కృతజ్ఞతలు. ఆరో సంచికకు చేరుకున్నామంటే మా బాధ్యత ఇంకా పెరుగుతుందని చెప్పవచ్చు. రెండు రాష్ట్రాలలో మంచి ఆదరణ వచ్చినందుకు చాలా ఆనందంగా వుంది. ఎంతో మంది ప్రముఖులు వారి స్పందనలు తెలుపుతున్నారు. వారందరికీ పేరుపేరునా మా స్టాఫ్ మరియు పిల్లల తరఫున ధన్యవాదములు. అలాగే గత నెలనుండి మిమ్మల్ని కూడా భాగస్వాములను చేశాం. మీ అభిరుచులకు అనుగుణంగా మా పత్రికను తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాను.

ఇక పోతే మా బడి గురించి...

మాది ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. మా బడిలో ప్రతి నెలా రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటాము.

మా బడిలో 6 నుండి 10 తరగతుల వరకు తెలుగు మీడియం మరియు 6వ తరగతి ఇంగ్లీష్ మీడియం వున్నాయి. ప్రతి సంవత్సరం 10వ తరగతి లో 95% పైగా ఉత్తీర్ణత సాధిస్తున్నాం.

పుస్తక పఠనం వలన పిల్లలలో చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందనే ఉద్దేశ్యంతో ఈ సంచికను ప్రారంభించాము. మీ అందరి ఆశీస్సులతో ఈ మాస పత్రికను ఇంకా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నాను.

మీ స్పందన కోసం ఎదురుచూస్తూ........

మీ **లత**

ప్రధానోపాధ్యాయురాలు


# వింతప్రపంచం



**సేకరణ:**
రాంబాబు, 10వ తరగతి,
జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం.ఖమ్మం జిల్లా.

## అయ్యబాబోయ్ వీటి గురించి తెలుసుకోపోతే ఎలా ......

ఈ భూమి మీద కొన్ని ఎంత అద్భుతంగా సృష్టించబడతాయో ఎవరికీ తెలియదు. వాటిల్లో కొన్నింటి ప్రత్యేకత మాటల్లో చెప్పలేనిది. మన జీవితంలో ఒక్కసారైనా వాటిని చూసి రావాల్సిందే. మనకు వీలు పడక పోతే కనీసం రికార్డులకెక్కిన వాటిలో కొన్నింటిని చూసైనా తరిద్దామా ...



స్పెయిన్‌లో 'జూజ్‌కర్' అనే చిన్న గ్రామం ఉంది. ఈ గ్రామం మొత్తం నీలం రంగుంలో ఉండటం దీని ప్రత్యేకత. ఆ ఊరంతా ఇలా నీలంరంగులో ఉండటానికి ఒక సినిమా కారణమట. ఆ సినిమా రిలీజ్ అయ్యి, ఆడిన నాటిన నుంచి అక్కడి ప్రజలంతా కలిసి గ్రామం మొత్తానికి నీలిరంగును వేసారట! ఆ సినిమా గురించిన పూర్తి సమాచారం తెలుసుకోవాలంటే స్పెయిన్ వెళ్ళాల్సిందే!!

స్వర్ణ దేవాలయం (అమృతసర్) పంజాబ్ రాష్ట్రం లో ఉన్న గోల్డెన్ టెంపుల్ దేశంలోనే కాక ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన యాత్ర స్థలం. ఇది సిక్కుల పవిత్ర పుణ్య క్షేత్రం గా ముద్రపడినది. అమృత్‌సర్ లో గల ఈ ఆలయం దేశంలోనే అతిపెద్ద గురుద్వారాగా ఖ్యాతి గడించింది. టెంపుల్ యొక్క గురుద్వారా పై అంతస్తులను కనివిని ఎరుగని రీతిలో 400 కేజీల బంగారంతో పూతపోశారు.





నేషనల్ లైబ్రరీ (కోల్ కతా) నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా లేక భారత జాతీయ గ్రంథాలయం కోల్ కతా లోని బెల్వెడెరే ఎస్టేట్ లో కలదు. ఇది భారతదేశంలో అతిపెద్ద గ్రంథాలయం గా రికార్డుకెక్కింది. ఈ గ్రంథాలయం సుందరమైన 30 ఎకరాల విస్తీర్ణంలో కలదు. ఇది 2.2 మిలియన్ల పుస్తకాల కంటే ఎక్కువ సేకరణతో భారతదేశంలో అతి పెద్దదిగా ఉంది. స్వాతంత్ర్యం రావడానికి ముందు ఇది బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ అధికార నివాసంగా ఉండేది ఈ గ్రంథాలయం.

# నేనెవరో తెలుసా!




ఆకు(ఆదిత్య కుమార్), SA
జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం.


**డియర్ ఫ్రెండ్స్!**
**ఈ శీర్షికలో ప్రతి నెల ఒక మూలకం తన గురించిన ఆసక్తి కర విషయాలను మనతో పంచుకుంటుంది. వాటిలో కొన్ని మనకు తెలిసినవి ఉండవచ్చేమో! కానీ తెలియనివి ఇంకొన్ని ఉండవచ్చుగా! చదివితేనే కదా తెలిసేది. కాబట్టి మీరు చదివి మీ అభిప్రాయాలు చెప్పండి.**

హలో ఫ్రెండ్స్! నేను మీకు ఉపయోగపడే నెంబర్ ౬ మూలకాన్ని. అదేనండీ! కార్బన్ ని. నా(కార్బన్ carbon)యొక్క తెలుగు పేరు కర్బనం. లాటిన్ భాషలో కార్బో అంటే బొగ్గు, రాక్షసి బొగ్గు అనే అర్థాలు ఉన్నాయి. మీరు కుంపట్లో వాడే బొగ్గులోనూ, రాక్షసి బొగ్గులోనూ విస్తారంగా ఉండే మూలకాన్ని.

నన్ను ఇంగ్లీషు అక్షరం C తో సూచిస్తారు. నా పరమాణుసంఖ్య ౬. నేను ఆవర్తన పట్టిక లో 14వ గ్రూపు (group) లో ఉన్న అలోహాన్ని. నా సంయోజకత(వేలన్సీ) 4. నాయొక్క అనేక రూపాంతరాల్లో (allotropic forms) ముఖ్యమైనవి గ్రాఫైట్, వజ్రం, ఫుల్లరిన్ (fullerine) మరియు అస్ఫటిక కర్బనం (amorphous carbon). నేను ప్రకృతిలో మూడు ఐసోటోపు(isotope) రూపాల్లో దొరుకుతాను. వాటిలో 12C, 13C స్థిరత్వం కలిగి ఉంటాయి. 14C మాత్రం రేడియో ధార్మిక ఐసోటోపు. దాని అర్ధ జీవిత కాలం 5700 సంవత్సరాలు.

ఈ విశ్వంలో విస్తారంగా దొరికే మూలకాలలో హైడ్రోజన్, హీలియం,ఆక్సిజన్ తరువాత నేను నాలుగవ స్థానంలో ఉన్నాను. మీతోపాటు అన్ని జీవులలోనూ నేను తప్పనిసరిగా ఉంటాను. మీ శరీరంలో ఆక్సిజన్ తరువాత నాది రెండవ స్థానం. మానవ శరీరంలోని పదార్థంలో 18.5 శాతం నేనే.


నా సంయోజకత 4 అవటం వల్ల నేను నాలుగు దిశలలో నాలుగు ఇతర పరమాణువులతో బంధాలను ఏర్పరుస్తాను. అందువల్ల నేను పెద్ద పెద్ద అణువులని ఏర్పరుస్తాను. సిలికాన్ అనే మూలకానికి కూడా సంయోజకత నాలుగే కానీ, ఈ భూలోకంలో జీవి కేవలం నా సంతతే. అందుకనే నాకు అంత ఎక్కువ ప్రాముఖ్యత ఉంది.


నా యొక్క భౌతిక లక్షణాలు నా రూపాంతరాలలోని రూపం మీద ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకి వజ్రం బాగా పారదర్శకంగా ఉండం వల్ల దాని మీద పడ్డ కాంతి కిరణాలు అన్నివైపులకీ వెదజల్లబడి మిలమిలా మెరుస్తుంది. కాని గ్రాఫైట్ కి ఆ లక్షణం లేకపోవటం వల్ల గ్రాఫైట్ మీద పడ్డ కాంతి పరావర్తనం చెందదు. అందువల్ల గ్రాఫైట్ నల్లగా కనిపిస్తుంది. అత్యంత గట్టి వస్తువులలో వజ్రం ఒకటి. వజ్రం గుండా విద్యుత్తు అంత సులభంగా ప్రవహించదు, కాని గ్రాఫైట్ గుండా అతి సునాయాసంగా ప్రవహిస్తుంది. ఫుల్లరీన్ ఉనికి 1985 లో కనుక్కున్నారు.

ముఖ్యంగా నా రూపాంతరాలు రెండు రకాలు:

అస్ఫటిక రూపాలు : కట్టె బొగ్గు, కోక్, చార్ కోల్, దీపపు మసి మొదలైనవి.

స్ఫటిక రూపాలు: వజ్రం, గ్రాఫైట్, బక్కీబాల్ (బక్ మినిస్టర్ ఫుల్లరిన్), నానో నాళాలు





అన్నట్టూ మరచిపోయాను. మీ శరీర భాగాలను ఎక్స్ రే, స్కానింగ్ ల ద్వారా ఎలా చూస్తారో,మమ్మల్ని వర్ణపటాల ద్వారా అలా చూస్తారు. నా ఫోటోలను చూడండి.



కార్బన్ వర్ణపటరేఖలు





ఎలక్ట్రాన్ షెల్



వజ్రం స్పటిక నిర్మాణం

## ఆవర్తన పట్టికలో నా స్థానం:



| Perioda \ Skupina | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 H | | | | | | | | | | | | | | | | | 2 He |
| 2 | 3 Li | 4 Be | | | | | | | | | | | 5 B | 6 C | 7 N | 8 O | 9 F | 10 Ne |
| 3 | 11 Na | 12 Mg | | | | | | | | | | | 13 Al | 14 Si | 15 P | 16 S | 17 Cl | 18 Ar |
| 4 | 19 K | 20 Ca | 21 Sc | 22 Ti | 23 V | 24 Cr | 25 Mn | 26 Fe | 27 Co | 28 Ni | 29 Cu | 30 Zn | 31 Ga | 32 Ge | 33 As | 34 Se | 35 Br | 36 Kr |
| 5 | 37 Rb | 38 Sr | 39 Y | 40 Zr | 41 Nb | 42 Mo | 43 Tc | 44 Ru | 45 Rh | 46 Pd | 47 Ag | 48 Cd | 49 In | 50 Sn | 51 Sb | 52 Te | 53 I | 54 Xe |
| 6 | 55 Cs | 56 Ba | | 72 Hf | 73 Ta | 74 W | 75 Re | 76 Os | 77 Ir | 78 Pt | 79 Au | 80 Hg | 81 Tl | 82 Pb | 83 Bi | 84 Po | 85 At | 86 Rn |
| 7 | 87 Fr | 88 Ra | | 104 Rf | 105 Db | 106 Sg | 107 Bh | 108 Hs | 109 Mt | 110 Ds | 111 Rg | 112 Cn | 113 Uut | 114 Fl | 115 Uup | 116 Lv | 117 Uus | 118 Uuo |

| | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Lantanidi | 57 La | 58 Ce | 59 Pr | 60 Nd | 61 Pm | 62 Sm | 63 Eu | 64 Gd | 65 Tb | 66 Dy | 67 Ho | 68 Er | 69 Tm | 70 Yb | 71 Lu |
| Aktinidi | 89 Ac | 90 Th | 91 Pa | 92 U | 93 Np | 94 Pu | 95 Am | 96 Cm | 97 Bk | 98 Cf | 99 Es | 100 Fm | 101 Md | 102 No | 103 Lr |

## మీ నిత్య జీవితంలో నేను:

**నన్ను నిత్య జీవితంలో ఎక్కడెక్కడ ఎలా వాడతారో చూడండి.**



**వజ్రం:** మీ నిత్యజీవితంలో ఆభరణాల రూపంలో నేనుంటాను.









**గ్రాఫైట్:** నన్ను మీరు చాలా రకాలుగా ఉపయోగిస్తున్నారు.








**కార్బన్ వలయం:**




**నానోనాళాలు:** మంచి విద్యుద్వాహకాలుగా వాడుతున్నారు




ఇంకా చాలా వున్నాయి. మీరే వెతకండి.

మీ కార్బన్




# నేను గీసిన బొమ్మ





ఈ శీర్షిక కేవలం మా పాఠశాల విద్యార్థులకు మాత్రమే. మా పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్నవారు వారి మనసుకు నచ్చిన బొమ్మను వేసి, రంగులు దిద్ది వారి తరగతి ఉపాధ్యాయుని ద్వారా పంపితే, బాగున్నవి ప్రచురించడం జరుగుతుంది. బాగా వేసిన వారికి బహుమతులు కూడా అందజేయడం జరుగుతుంది.










## మెదడుకు మేత

ఇక్కడ ఇచ్చే వాటికి సమాధానాలను పిల్లలే రాసే విధంగా అందరు టీచర్లు ప్రోత్సహించాలని కోరుకుంటున్నాం.

జవాబులను 27వ తేదీలోగా పంపగలరు

# నింపండి –గెలవండి 4

ఈ శీర్షిక కేవలం రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే. 6 నుండి 10 వ తరగతి చదివే వారు మాత్రమే అర్హులు. మీరు చేయవలసిందల్లా క్రింది పజిల్ ను మీ స్వదస్తూరితో నింపి, మీ పేరు, తరగతి, స్కూల్ పేరు, ఊరు రాసి మీ పాఠశాల ఉపాధ్యాయుని ద్వారా మాకు ప్రతినెలా 27 వ తేదీ వరకు అందేలా పంపాలి. సరైన జవాబు రాసిన వారికి 100 రూపాయల బహుమతి ఇవ్వబడును. ఒక్కరి కంటే ఎక్కువ మంది సరైన జవాబు రాస్తే లాటరీ ద్వారా విజేతను ఎంపిక చేస్తాం. మరెందుకు ఆలస్యం.. పుస్తకం, పెన్ను తీసుకొని నింపండి...గెలవండి....

**నింపండి**


**గెలవండి**



మాణిక్య రావు

**బహుమతి**

**100 రూపాయలు**




**నిలువు:**

1. $A = \pi r^2$ సూత్రం తో కనుగొనేది(6)  2. "Gland" తెలుగులో క్రింది నుండి పైకి (2)  3. సౌందర్యం (2)  4. ఒక గ్రహం ( 2)
6. 'గొయ్యి' ఆంగ్లంలో (3)  7. "గోరు" పర్యాయపదం (2)
8. 'दोष' का विलोम शब्द (2)
11. 'अमीर' का विलोम शब्द (3)  12. '4 చక్రాల వాహనం' ఆంగ్లంలో (3)
15. జిడిపి (GDP) పెరుగుదల ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వరుస త్రైమాసికంలో తగ్గుతూవుంటే ఆర్థిక _____ ఏర్పడిందని అంటారు (3)
18. 'చిత్రం లేదా బొమ్మ' ఆంగ్లంలో (5)
19. కాంతి ఒక యానకం నుండి మరో యానకంలోనికి ప్రయాణించేటపుడు వంగడం (5)
21. లం.కో.త్రిభుజంలో ___ మీది వర్గం, మిగిలిన రెండు భుజాల మీది వర్గానికి సమానం. (3) లేదా అడ్డం 21లో ఉన్నదే
25. ప్రయాణించిన దూరం = వేగం X _______ (3)
27. మొత్తం = అసలు + _____ (2)
28. వరిపొట్టు (2)  29. మాసం (2)
30. వస్తువునకు దానిస్థితి వలన కలిగిన శక్తిని _____ శక్తి అంటారు (2)

**అడ్డం**

1. "ఈ+విధము" ఏ సంధి (4)  3. పుష్పంలో "స్త్రీ ప్రత్యుత్పత్తి భాగము" (5)
5. అక్షరాల కూర్పు (2)  9. 'दरबार' में प्रत्यय (2)  10. తెలుగు నెలలలో రెండవది (3)  12. 'మంచం' ఆంగ్లంలో (3)  13. "దగ్గర" హిందీ లో (3)
14. "తాళిబొట్టు" కుడి నుండి ఎడమకు (3)  16. "లోపల" హిందీలో (1)  17. 'ప్రక్కటెముక' ఆంగ్లంలో (3)  20. -2,-1,0,1,2,... లు ___ సంఖ్యలు (2)
21. "చెవి" పర్యాయపదం (3)  22. "పురుషుడు" ఆంగ్లంలో (3)  23. "తేలిక" కుడి నుండి ఎడమకు (4)  24. "మూడు+ లోకాలు" (4).  26. "నేను" హిందీలో (1)  27. అడవి (2)  31. సంతోషానికి పర్యాయపదం (ఎటునుండి చదివినా ఒకటే) (3)
32. జనవరిలో హిందువులు జరుపుకునే పండుగ (6)

**"सपने वो नहीं है जो हम नींद में देखते है, सपने वो है जो हमको नींद नहीं आने देते।"**



టి.దుర్గాదేవి,PET
జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం



# ఈ నెలలో మా బడిలో .........

ఈ శీర్షికలో ఈ నెలలో మా బడిలో జరిగిన వివిధ కార్యక్రమాల గురించి వివరించడం జరుగుతుంది. ఇవి ఇతరులకు ప్రేరణనిస్తాయని మా ఉద్దేశ్యం. అలాగే మా పిల్లల్లో కూడా అన్ని కార్యక్రమాలలో పాల్గొనాలనే ఆసక్తిని పెంచవచ్చని మా అభిప్రాయం



10 వ తేదీన మేము పిక్నిక్ వెళ్ళాము.అక్కడ విద్యార్థినీ విద్యార్థులు చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. ఈ పిక్నిక్ వలన వారిలో ఐకమత్యం, ఇతరులతో మాట్లాడటం మొదలైనవెన్నో నేర్చుకున్నారు.



మా బడిలో Craft Instructor గా పనిచేయుచున్న ఉపేందర్ గారి ఆధ్వర్యంలో పిల్లలచే రకరకాల వస్తువులను చేయించడం జరిగింది.









**(PCRA) PETROLEUM CONSERVATION RESEARCH ASSOCIATION** వారు online లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో యమున, IX Class జాతీయస్థాయి పోటీకి ఎన్నికై Samsung TABని, ప్రశంసా పత్రాన్ని SMC చైర్మన్ శ్రీమతి సులోచన & HM లత గారి చేతుల మీదుగా అందుకుంది. సికింద్రాబాద్ లో dec'11 న జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నది



**Farmer's Day** సందర్భంగా మా బడిలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అందులో బాలబాలికలు పాల్గొన్నారు. పోటీలో మొదటి బహుమతి త్రివేణి IX, రెండవ బహుమతి సుజిత X గెలుచుకున్నారు.



డిసెంబర్ 30 వ తేదీన డయల్ 100 పై విద్యార్థినీవిద్యార్థుల కు పోలీసు శాఖవారు అవగాహన కల్పించారు.

# ఎవరు కనుగొన్నారో తెలుసా?




వివేక్, 10వ తరగతి,
జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం.ఖమ్మం



## స్టేప్లర్ ని కనుగొన్నారిలా...




హలో ఫ్రెండ్స్,

బావున్నారా! నేనండీ మీరు ప్రాజెక్టు పనులు చేసినపుడు కాగితాలకు, పుస్తకాలకు అట్టలు వేసుకున్నపుడూ వాడుతారే ఆ స్టేప్లర్ ని. ప్రతి ఒక్కరికీ, ఏవైనా రెండింటిని కలిపి ఉంచాల్సిన ప్రతి సందర్భంలో సహాయపడతాను. ఈ మధ్య శస్త్ర చికిత్స లలో కూడా డాక్టర్లు నన్ను వాడుతున్నారు తెలుసా!

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ నన్ను వాడుతున్నారు. చాలామంది దగ్గర ఒకటి కంటే ఎక్కువ ఉంటున్నాయి. వాటిని ఆఫీసు వద్ద, ఇంట్లో, మరియు వ్యాపార ప్రదేశాలలో కూడా ఉపయోగిస్తున్నారు. ప్యాకేజీ డెలివరీ అయినప్పుడు, ఆ ప్యాకేజీని మూసివేయడానికి నన్ను మీరు ఉపయోగిస్తుంటారు కదా! నా ఆవిష్కరణ ఈ రోజుల్లో మన భూ గ్రహం మీద ఉన్న అత్యంత సాధారణ మరియు అత్యంత ఉపయోగకరమైన సాధనాల్లో ఒకటిగా వుంది.




మొట్టమొదటిసారిగా 1866 లో, జార్జ్ మెక్‌గిల్ యు.ఎస్. పేటెంట్ 56,587ను పొందాడు, ఇది చిన్నది, వంగదగిన ఇత్తడి కాగితం ఫాస్టెనర్ కోసం, దీన్ని ఆధునికమైనదిగా చెపుతారు. 1867 లో, ఫాస్టెనర్‌ను కాగితంలోకి చొప్పించడానికి ప్రెస్ కోసం యు.ఎస్. పేటెంట్ 67,665 ను అందుకున్నాడు. అతను పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియాలో 1876 సెంటెనియల్ ఎగ్జిబిషన్‌లో తన ఆవిష్కరణను చూపించాడు మరియు 1880 లలో కూడా వివిధ కాగితపు ఫాస్టెనర్‌లపై పని కొనసాగించాడు. 1868 లో, నాకోసం ఇంగ్లీష్ పేటెంట్ సి. హెచ్. గౌల్డ్‌కు లభించింది, మరియు యు.ఎస్., సెయింట్ లూయిస్‌కు చెందిన ఆల్బర్ట్ క్లెట్జ్‌కేర్, MO యొక్క ఒక పరికరానికి కూడా పేటెంట్ ఇచ్చారు.






ఫిబ్రవరి 18, 1879 న, జార్జ్ మెక్‌గిల్ 212,316 పేటెంట్‌ను మెక్‌గిల్ సింగిల్-స్ట్రోక్ నన్ను(స్టేపుల్ ను) ప్రెస్ కోసం పొందాడు, ఇది వాణిజ్యపరంగా విజయవంతమైన మొదటిది. ఈ పరికరం రెండున్నర పౌండ్ల బరువు మరియు 1/2 అంగుళం వెడల్పు గల వైర్ స్టేపుల్‌ను లోడ్ చేసేంది, ఇది అనేక కాగితపు షీట్ల ను బంధించి వుంచగలదు.






ఇలా చాలా సంవత్సరాల ప్రయోగాల తర్వాత నేడు మీరు వాడుతున్న నన్ను ఆధునిక రూపాలో వున్న నన్ను కనుగొన్నారు.

1941 సం.లో ఈ రోజు వాడుకలో సర్వసాధారణమైన కాగితాలకు ఉపయోగించే రకం అభివృద్ధి చేయబడింది.

నా కథ చాలా పెద్దది ఎందుకంటే "ఎవరితోనైతే ఎక్కువ పని ఉంటుందో, వారిని రకరకాలుగా ఉపయోగించుకోవటానికి ప్రయత్నిస్తారు" నేను ఎప్పుడూ ఇతరుల సేవలో తరిస్తుంటాను.

పటంలో నాలోని భాగాలను చూడండి.


ఇప్పుడు వాడుతున్న రకాలలో కొన్నింటిని చూద్దాం..



A long reach stapler is used to staple items such as booklets.



A booklet stapler that rotates 90 degrees for vertical or horizontal stapling.



Clipless Stand Machine.



Heavy-duty foot-activated electric stapler.



Skin stapler



Surgical stapler

ఇక సెలవ్...... మీ స్టేప్లర్




## పజిల్ – 4 సమాధానాలు

డిసెంబర్ నెలలో విడుదలైన "మాబడి" సంచికలోని పజిల్ కు రెండు రాష్ట్రాలలోని విద్యార్థుల నుండి విశేష స్పందన వచ్చింది.డిసెంబర్ 27వ తేదీ నాటికి అందిన వాటిలో మా "కీ" ప్రకారం సరియైన సమాధానాలు పంపిన వారు:

K.సింధు,X,ZPHS రేవూరు, నెల్లూరు జిల్లా(డ్రా లో గెలుపొందిన వారు), K.రవి X,హైదరాబాద్; T.కావ్య IX, వైజాగ్; D.భవ్య X,కావలి; B.బాలు VIII, నిజామాబాద్; P.రఘు X, విజయవాడ; Y.శృతి, వరంగల్; L. రాకేష్ IX, పార్వతీపురం; V.వెంకన్న IX,రావినూతల; R.కార్తీక్ X,యాదాద్రి;

గమనిక: బహుమతి అందిన వెంటనే మీ ప్రధానోపాధ్యాయునిచే అందించి,ఫోటోను మాకు పంపగలరు. వచ్చే సంచికలో ప్రచురిస్తాం.



పజిల్ – 4 కి సరియైన జవాబులు వ్రాసి బహుమతి పొందిన B.మోహనా చారి X మాధాపురం, ఖమ్మం జిల్లా HM శ్రీ వినయ్ కుమార్ గారి ద్వారా బహుమతిని అందుకుంటున్న దృశ్యం...

మీరు కూడా ఇలాగే భాగస్వాములు కండి మరి...





# నేను చేసిన ప్రయోగం



ఈ శీర్షికలో మా బడి లో చదివే విద్యార్థినీ విద్యార్థులు ఆ నెలలో తాము చేసిన ప్రయోగాన్ని వివరించడం జరుగుతుంది. ఇది ప్రతి విద్యార్థికి ప్రేరణగా ఉంటుందని మా అభిప్రాయం. చాలా మంది విద్యార్థులు ప్రయోగాలను చేస్తున్నప్పటికీ, బడికి క్రమం తప్పకుండా రావడంలో గానీ, క్రమశిక్షణలో గానీ, చదవడంలో గానీ ముందున్న వారికి ముందుగా అవకాశం ఇవ్వడం జరుగుతుంది.

## ఈ నెల ప్రయోగం చేసినవారు: వాసు, గోపి 9వ తరగతి

హలో ఫ్రెండ్స్! మేము ఈ రోజు మీకు చాలా సులభంగా, తక్కువ ఖర్చుతో పరావర్తన సూత్రాలను ఎలా నిరూపించవచ్చో మీకు చెపుతాము, మీరూ ట్రై చేయండి. చేస్తారు కదూ.........

**లక్ష్యం:** బ్రామాప్రెస్ ని తాయారు చేయడం



**తీసుకున్నవి:** వాడి పడేసిన సిరంజీలు రెండు (20ml ఒకటి, 5ml ఒకటి), ఆసుపత్రిలో గ్లూకోజ్ ఎక్కించడానికి ఉపయోగించే పైపు. “U” ఆకారపు చెక్కస్టాండు, నీరు, కరెంటు జంక్షన్ బాక్సులపై పెట్టే ప్లాస్టిక్ షీట్లు -2.

**చేసిన విధానం:** ముందుగా పెద్ద సిరంజికి, చిన్న సిరంజికి పైపును పటంలో చూపినట్లు అమర్చాం. పెద్ద సిరంజి ని నీటితో నింపి, దానికి ముషలకాన్ని అమర్చిన తర్వాత చిన్న సిరంజి ముషలకాన్ని అమర్చాము.



ముషలకాలపై ప్లాస్టిక్ షీట్లను వుంచి, ఇప్పుడు ఈ రెండింటిని పటంలో చూపినట్లు స్టాండ్ అంచులకు పెట్టి దారంతో కట్టాం. చిన్న సిరంజి ముషలకంపై 100 గ్రాముల బరువు ఉంచి, పెద్ద సిరంజి పై బరువులను మారుస్తూ దాదాపు 450 గ్రాముల వరకు మనం బరువును ఎత్తవచ్చు.

**కారణం:** ఒక ప్రవాహికి పైన కలుగజేసిన పీడనం అనేది అన్నివైపులా సమానంగా పనిచేస్తుంది అనే పాస్కల్ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది.

**ఉపయోగాలు:** పత్తి బేళ్ళు తయారీకి, బట్టలు, కాగితాలను అదిమిపట్టడానికి, వాహనాలను ఎత్తడానికి వాడే జాకీలు,హైడ్రాలిక్ బ్రేకులు,హైడ్రాలిక్ పంపులు,హైడ్రాలిక్ క్రేన్లు,హైడ్రాలిక్ టిప్పర్లు, ఎయిర్ బ్రేకులు మొదలగు వాటిలో ఈ సూత్రం ఉపయోగ పడుతుంది.

ఈ చిన్ని ప్రయోగాన్ని చేస్తారు కదూ!

వచ్చే నెలలో మరో ప్రయోగంతో మళ్ళీ కలుద్దాం....... ఇక సెలవ్

# సులభంగా గణితం నేర్చుకుందాం!



వి.వేణుగోపాల్ రాజు,SA
ZPHS
RAJESWARAPURAM

మన పాఠశాలల్లో చాలా మంది విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియలు సరిగా రావడం లేదు. వాటి కోసం రకాల కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోతుంది. గణితం వచ్చిన వాడికి అన్ని సబ్జెక్టులు సులభంగా వస్తాయని ఎన్నో పరిశోధనలలో తేలింది. చిన్న చిన్న టెక్నిక్స్ తో పెద్ద పెద్ద లెక్కలను సులువుగా ఎలా చేయవచ్చో ఈ శీర్షిక ద్వారా పిల్లలకు చేరితే మనం కొంత వరకు విజయం సాధించిన వారమౌతాం.

కాబట్టి ఈ శీర్షికలో ప్రతి నెలా గణిత చతుర్విధ ప్రక్రియలలో ఏదో ఒక దానికి చిట్కాలను వివరించడం జరుగుతుంది.

## 25 చే గుణించడం ఇంత సులభమా!

2546 × 25 విలువ ఎంత అనగానే 'అబ్బో అంత పెద్ద లెక్క వెంటనే ఎలా చెబుతారు' అని అంటారు కదా! కానీ చాలా సులభంగా చెప్పవచ్చు. అదెలా అంటారా......

| ఉదా: 1 | ఉదా: 2 |
|---|---|
| 24 × 25 = ? | 45 × 25 = ? |

దేనినైనా '25' చే గుణించాలంటే మొదట, ఇచ్చిన సంఖ్యను '4' తో మనసులో భాగించుకుంటూ వెళ్ళి, భాగఫలాన్ని రాసుకోవాలి. ఆ తర్వాత శేషం ఎంత అనేది చూసుకొని, శేషం '0' ఐతే భాగఫలం చివర '00' వెయ్యాలి. లేదా శేషం '1'అయితే భాగఫలం చివర '25' వెయ్యాలి. లేదా శేషం '2'అయితే భాగఫలం చివర '50' వెయ్యాలి. లేదా శేషం '3'అయితే భాగఫలం చివర '75' వెయ్యాలి. అంతే గుణకారం అయిపోయి నట్లే.

ఉదా: 1 ని చూద్దాం

24 ను 4 చే భాగించగా భాగఫలం 6, శేషం '0' వచ్చింది కాబట్టి భాగఫలం ప్రక్కన '00' చేర్చాలి. అనగా

24 × 25 = 6<u>00</u>

ఉదా: 2 ను చూద్దాం

45 ను 4 చే భాగించగా భాగఫలం 11, శేషం '1' వచ్చింది కాబట్టి భాగఫలం ప్రక్కన '25' చేర్చాలి. అనగా

45 × 25 = 11<u>25</u>

ఈజీగా ఉందా! వచ్చేనెల మరో చిట్కాతో మళ్ళీ కలుద్దాం.

ఇక సెలవ్.  మీ వేణుగోపాల్








# అద్భుత యంత్రం



డి.జయమ్మ, SA
ZPHS RAJESWARAPURAM




మన శరీరం మాంసపు ముద్దతో తయారైన ఒక అద్భుత యంత్రం. ఈ యంత్రంలో అనేక వ్యవస్థలున్నాయి.


అవి, జీర్ణ వ్యవస్థ, శ్వాస వ్యవస్థ, రక్త ప్రసరణ వ్యవస్థ, కండర వ్యవస్థ, అస్థి పంజరవ్యవస్థ, నాడీ వ్యవస్థ, శోష రస వ్యవస్థ, అంతస్రావి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, విసర్జన వ్యవస్థ, వ్యాధినిరోధక వ్యవస్థ. గత నెలలో చెప్పినట్లు ఒక్కొక్క అవయవ వ్యవస్థ గూర్చి ఒక్కొక్క నెల వివరంగా తెలుసుకొందాం.


ఈ నెలలో మనం మన శ్వాస వ్యవస్థ గురించి తెలుసుకుందాం.

**గత సంచిక తరువాయి...........**




**గ్రసని:** శ్వాస కుహరము మరియు ఆస్యకుహరం ల కూడలిని గ్రసని అంటారు. ఇది అధిక ఉష్ణోగ్రత వాయువు శ్వాస మార్గంలోనికి ప్రవేశించినపుడు ఆ ఉష్ణోగ్రతను శరీర ఉష్ణోగ్రత ($37^{o}C$ లేదా 98. కు క్రమ పరుస్తుంది.అందుకే దీనిని "AIR COOLER" అని అంటారు.




**స్వరపేటిక :** గ్రసని తరువాత గల భాగమును స్వరపేటిక అంటారు. ఇది మొత్తం "9" ఎముకలతో నిర్మితమై వుంటుంది. ఈ ఎముకలు మృదులాస్థితో నిర్మితమౌతాయి. దీనికి గల ముఖ్యమైన ఎముకలలో ఉపజిహ్వక(Epiglottis) ఒకటి. ఇది ఆహారాన్ని శ్వాస మార్గంలోనికి పోకుండా అడ్డుకుంటుంది. స్వరపేటిక లో ఒక జత స్వర తంత్రులు (Vocal Cords) ఉంటాయి. ఇవి నిశ్వాస క్రియలో కంపించుట వలన శబ్దం ఉత్పత్తి అవుతుంది. అందుకే దీనిని శబ్ద పేటిక(Voice Box) అంటారు. ఊపిరితిత్తు లలోని గాలితో మాటలను సృష్టించేదే ఈ స్వరపేటిక. స్వరపేటికలో ఏ చిన్న మార్పు వచ్చినా ముందుగా మాట మారి పోతుంది.

**వచ్చే నెలలో మరికొంత నేర్చుకుందాం...**

ఇక సెలవ్ మీ **జయమ్మ**


**అర్థరహితమైన మాటలకన్నా, అర్థవంతమైన నిశ్శబ్దం చాలా గొప్పది**

# గమ్మత్తైన గడియారాలు




MD.SUJATH ALI, SA
ZPHS RAJESWARAPURAM

## హాయ్ పిల్లలూ !




మీచేత "బాబోయ్" లెక్కలు నుండి "భలే భలే" లెక్కలు అని అనిపించడానికి గమ్మత్తైన గణిత గడియారాలను తయారు చేద్దామా! మొదట 'వర్గమూలాల గడియారము', $\sqrt{1}=1$, $\sqrt{4}=2$, $\sqrt{9}=3$, $\sqrt{16}=4$, $\sqrt{25}=5$, $\sqrt{36}=6$, $\sqrt{49}=7$, $\sqrt{64}=8$, $\sqrt{81}=9$, $\sqrt{100}=10$, $\sqrt{121}=11$, $\sqrt{144}=12$ అని మనకు తెలుసు కదా? ఒక చార్ట్ పై కోణమానికి ఉపయోగించి గడియారంని గీద్దాం. 1, 2, 3.... 12 స్థానాలలో మనం పైన పేర్కొన్న వర్గమూలాలను ఉంచుదాం.




ఇక రెండవది "ఘన మూలాల గడియారం" ఆహా అప్పుడే మీకు తెలిసిపోయింది కదా! $\sqrt[3]{1}=1$, $\sqrt[3]{8} = 2$, $\sqrt[3]{27}= 3$, $\sqrt[3]{64}=4$, $\sqrt[3]{125} = 5$, $\sqrt[3]{216} =6$, $\sqrt[3]{343} = 7$, $\sqrt[3]{512} = 8$, $\sqrt[3]{729} = 9$, $\sqrt[3]{1000} = 10$, $\sqrt[3]{1331} = 11$, $\sqrt[3]{1728}= 12$

నచ్చాయ పిల్లలూ, ఇంకా తయారు చేద్దాం. రామానుజన్ నెంబరు 1729 అని తెలుసుకదా, ఈ అంకెలనుపయోగించి, క్రమం తప్పకుండా 1 నుంచి 12 వరకు తయారు చేద్దామా... బాగున్నాయి కదూ... వీటితో ఇప్పుడు మీరు గడియారం తయారు చేసి మీ తరగతిలో వుంచండి. వుంచుతారు కాదూ......

| | |
|---|---|
| $1+7+2-9 = 1$ | $(1+7)X2-9 = 7$ |
| $1+(7+2)/9 = 2$ | $17X2\sqrt{9} = 8$ |
| $-1-7+2+9 = 3$ | $(17)2X9 = 9$ |
| $-1(7)+2+9 = 4$ | $17+2-9 = 10$ |
| $1-7+2+9 = 5$ | $-(1X7)+(2x9) = 11$ |
| $17-2-9 =6$ | $1-7+2X9 = 12$ |

ఇలాంటి గడియారాలను తయారుచేసె మీ మీ తరగతి గదులలో పెడతారు కదా! ఇంకా కొన్ని కొత్త రకాలను చూద్దామా....

మీ **అలీ**

# తెలుసుకుందామా!



వీరాంజనేయులు, SA
ZPHS RAJESWARAPURAM

**ఈ శీర్షికలో మనం ప్రతి నెలా సాంఘిక శాస్త్రానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవడం జరుగుతుంది. అందులో భాగంగా "ఐక్యరాజ్యసమితి" గురించి తెలుసుకుంటున్నాం. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి యొక్క అంగాలు, అవి చేసే కార్యక్రమాలను గురించి మనం ప్రతి ఒక్కరం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. గత నెలలో భద్రతామండలి గురించి తెలుసుకున్నాం కదా! మరి ఈ నెలలో ........ ఇక చదవండి.**

**గత సంచిక తరువాయి......**

**ఆర్థిక మరియు సామాజిక మండలి (ECOSOC) :** ఐక్యరాజ్యసమితి యొక్క ఆర్థిక మరియు సామాజిక రంగాలను సమన్వయం చేసే బాధ్యత కలిగిన ఐక్యరాజ్యసమితి యొక్క ఆరు ప్రధాన అవయవాలలో ఐక్యరాజ్యసమితి ఆర్థిక మరియు సామాజిక మండలి (ECOSOC) ఒకటి. దీని పరిధిలోని 15 ప్రత్యేక ఏజెన్సీలు, 8 ఫంక్షనల్ కమీషన్లు మరియు 5 ప్రాంతీయ కమీషన్లకు బాధ్యత వహిస్తుంది.



ఐక్యరాజ్యసమితి సమావేశ భవనంలోని ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ఛాంబర్ స్వీడన్ ఇచ్చిన బహుమతి. యుఎన్ ప్రధాన కార్యాలయాన్ని రూపొందించిన అంతర్జాతీయ జట్టులోని 11 మంది వాస్తుశిల్పులలో ఒకరైన స్వీడిష్ ఆర్కిటెక్ట్ స్వెన్ మార్కెలియస్ దీనిని రూపొందించారు. స్వీడిష్ పైన్ చెట్ల నుండి కలపను రెయిలింగ్లు మరియు తలుపుల కోసం ప్రతినిధుల ప్రాంతంలో ఉపయోగించారు


అంతర్జాతీయ ఆర్థిక మరియు సామాజిక సమస్యలపై చర్చించడానికి, సభ్య దేశాలకు మరియు ఐక్యరాజ్యసమితి వ్యవస్థకు ఉద్దేశించిన విధాన సిఫార్సులను రూపొందించడానికి కౌన్సిల్ ప్రధాన వేదికగా పనిచేస్తుంది. ఐక్యరాజ్యసమితి యొక్క పనిలో పాల్గొనడానికి, అనేక ప్రభుత్వేతర సంస్థలు దీనికి సంప్రదింపుల హోదా ఇచ్చాయి.

1998 నుండి ఇది ప్రతి సంవత్సరం జూలైలో ఒక నాలుగు వారాలపాటు సమావేశాల్ని నిర్వహిస్తుంది. ప్రపంచ బ్యాంకు మరియు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐ.ఎం.ఎఫ్) యొక్క ముఖ్య కమిటీలకు నాయకత్వం వహిస్తున్న ఆర్థిక మంత్రులతో ఏప్రిల్‌లో వార్షిక సమావేశాన్ని కూడా నిర్వహించింది.

కౌన్సిల్ అధ్యక్షుడు, ప్రతి కొత్త సెషన్ ప్రారంభంలో కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న చిన్న లేదా మధ్య తరహా అధికారాల నుండి ఒక సంవత్సరం కాలానికి ఎన్నుకోబడతారు. అధ్యక్ష పదవిని ఐక్యరాజ్యసమితి ప్రాంతీయ సమూహాలలో సమాన ప్రాతినిధ్యం ఉండేలా మారుతూ వుంటుంది.



**ప్రస్తుత అధ్యక్షులు:** జూలై 25, 2019 న, మోనా జుల్ ఐక్యరాజ్యసమితి ఆర్థిక మరియు సామాజిక మండలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. **మోనా జుల్** (జననం 10 ఏప్రిల్ 1959) నార్వేజియన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో అధికారి మరియు లేబర్ పార్టీ మాజీ రాజకీయవేత్త. 1990 లలో ఓస్లో ఒప్పందాలను సులభతరం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించింది.




కౌన్సిల్ 54 సభ్య దేశాలను కలిగి ఉంది, వీటిని మూడేళ్ల కాలపరిమితి కోసం జనరల్ అసెంబ్లీ ఎన్నుకుంటుంది. కౌన్సిల్‌లోని సీట్లు ఐక్యరాజ్యసమితి ప్రాంతీయ సమూహాలలో సమానమైన భౌగోళిక భ్రమణాన్ని నిర్ధారిస్తాయి, వీటిలో 14 ఆఫ్రికన్ గ్రూపుకు, 11 ఆసియా-పసిఫిక్ గ్రూపుకు, 6 తూర్పు యూరోపియన్ గ్రూపుకు, 10 లాటిన్ అమెరికన్ మరియు కరేబియన్ గ్రూపులకు, 13 వెస్ట్రన్ యూరోపియన్ మరియు ఇతరులు సమూహానికి కేటాయించబడ్డాయి.

**జీవితం చాలా కష్టమైన పరీక్ష. దానిలో చాలామంది విఫలం చెందటానికి కారణం, ప్రతీ ఒక్కరి ప్రశ్నాపత్రం వేరని గ్రహించకపోవటమే**

ప్రస్తుత సభ్యులు:

| Term | African States (14) | Asian States (11) | Eastern European States (6) | Latin American & Caribbean States (10) | Western European & Other States (13) |
|---|---|---|---|---|---|
| 2019 - 2021 | Angola<br>Egypt<br>Ethiopia<br>Kenya<br>Mali | Iran (Islamic Republic of)<br>Pakistan<br>Saudi Arabia<br>Turkmenistan | Armenia<br>Ukraine | Brazil<br>Jamaica<br>Paraguay | Canada<br>Luxembourg<br>Netherlands<br>United States of America |
| 2018 - 2020 | Ghana<br>Malawi<br>Morocco<br>Sudan<br>Togo | India<br>Japan<br>Philippines | Belarus | Ecuador<br>El Salvador<br>Mexico<br>Uruguay | France<br>Germany<br>Ireland<br>Malta<br>Turkey |
| 2017 - 2019 | Benin<br>Cameroon<br>Chad<br>Eswatini | Cambodia<br>China<br>Republic of Korea<br>Yemen | Azerbaijan<br>Romania<br>Russian Federation | Colombia<br>Saint Vincent and the Grenadines<br>Venezuela (Bolivarian Republic of) | Andorra<br>Denmark<br>Norway<br>United Kingdom of Great Britain and Northern Ireland |

వచ్చే నెల మరో దాని గురించి...

ఇక సెలవ్.....మీ **వీరాంజనేయులు**



# మీకు తెలుసా?



## మన చూపుకీ, పక్షి చూపుకీ తేడా ఉంటుందని మీకు తెలుసా!

మనకీ, పక్షికీ రెండు కళ్ళే ఉన్నాయి. కానీ అవి ఉన్న ప్రాంతాలు వేరు. మనకి రెండు కళ్ళు ముఖం మీద ఉంటాయి. పక్షికి రెండు ప్రక్కల ఉంటాయి. అందువలన పక్షికి రెండు కళ్ళు ఒకే బిందువును కేంద్రీకరించి చూడగలగడం తక్కువ ప్రాంతానికే పరిమితం అవుతుంది. దీన్నే "బైనాక్యులర్ విజన్" అంటారు బైనాక్యులర్ విజన్ ద్వారా పక్షి తన ముక్కు ముందు భాగంలో ఉండే ప్రదేశాన్ని మాత్రమే చూడగలదు. అక్కడి వస్తువు ఏదైనా ఎంత దూరంలో ఉందో చూడగలదు.

పక్షి చెరొక కన్నుతో చుట్టూ ఉండే వస్తువులను 180 డిగ్రీల కోణం వరకు చూడగలదు. అంటే నలు(నాలుగు) దిక్కులూ చూడగలదు. శత్రువుని గుర్తించగలదు. ఇది తల తిప్పి చూసింది అంటే చుట్టూ ఉన్న ప్రాంతమంతా దాన్ని దృష్టికి వస్తుంది. దీనికి ప్రతిబింబాలు కళ్ళల్లో అంతర్గతంగా ఏర్పడేందుకు నిర్మాణాత్మక ఉంటాయి. బైనాక్యులర్ విజన్ కంటికి వెనుక భాగంలోనూ, మోనాక్యులర్ విజన్ (విడి కంటితో ఏర్పడే ప్రతిబింబాలకు) కేంద్ర భాగంలో ఈ అమరికలు ఉంటాయి. పక్షులలో ఈ రెండు రకాల దృష్టి బాగా వుంటుంది.

మనిషికి ఈ రకమైన రెండు దృష్టి సామర్థ్యాలు ఉండవు. మనకు ముఖం మీద కళ్ళు ఉండడంవల్ల బైనాక్యులర్ విజన్ మాత్రమే ఉంటుంది కాబట్టి రెండు కళ్ళ ద్వారాఒకే దృశ్యాన్ని చూడగలం. కానీ పక్షులకు అలా కాదు.






K.శ్రీనివాస్, PGHM
ZPHS వెంకటేశ్వర నగర్
చింతపల్లి (మం)
నల్లగొండ జిల్లా.

# బొమ్మలు వేయడం ఎలా?

హాయ్ పిల్లలూ! ముందుగా మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీకు ప్రతినెలా బొమ్మలు నేర్పుతున్నాను కదా! ఆ బొమ్మలు గీస్తున్నారా!


మనకు పొద్దున లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకోబోయే ముందు వరకు ఎన్నో తెలిసీ తెలియని విషయాలు ఖర్చులేకుండా నేర్పే దేవుడి బడే ఈ ప్రకృతి. చెట్లు, కాయలు, పూలు, పళ్ళు పక్షులు, జంతువులు, మనుషులు, ఆకాశం, నీడలు, నీళ్లు, రంగులు ఇలా ఎన్నో మధురమైన మనోహరమైన దృశ్యాల్ని మనం మరిచిపోలేం. ఇటువంటి మర్చిపోలేని మధుర స్మృతుల్ని అందంగా బంధించేదే ఈ చిత్రలేఖనం. ప్రపంచంలో భాష, కుల, మత బేధాలు లేకుండా ఏ వయసు వారినైనా ఆకట్టుకునే సాదనం చిత్రలేఖనం. లిపి లేని రోజుల్లో కూడా లిపిగా చరిత్రను చెప్పిన విశిష్టమైన ప్రక్రియ ఈ చిత్రలేఖనం. ప్రతి మనిషి తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక బొమ్మ తప్పని సరిగా వేస్తాడు. గొప్పవారు కావాలనుకునే వారికి ఎవరికైనా ఏ ప్రక్రియకైనా చిన్నప్పటి నుండి సాధన చేయడం అత్యవసరం. నేడు మీరు వేసే చిన్న చిన్న బొమ్మలు రేపటి పెద్దపెద్ద కళాఖండాలు కావచ్చు. ఆలస్యం దేనికి కానివ్వండి. నాకు బొమ్మలు వేయడం రాదు అని దిగులు పడాల్సినవసరం లేదు. ముందుగా పెన్సిల్ తో మీరు మీ పేరును చక్కగా రాసుకోగలితే చాలు. మీరు బొమ్మలు వేసేయగలరు. ఎలా అంటే అక్షరాలు రాయడానికి ఉపయోగించే వంపులు తిప్పే గీతలే బొమ్మలు అవుతాయి. మనకు తెలిసిన గీతల్ని రకరకాల ఆకారాలకు అనుగుణంగా అటు ఇటుగా కలిపితే చాలు అవే మంచి మంచి బొమ్మలు అయిపోతాయి. అన్నట్టు ముఖ్యంగా ఓ విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. నీలి ఆకాశంలో కదిలే తెల్లని మేఘాలలో, రోడ్డు ప్రక్కన గల చెట్ల నీడలలో, ఇంట్లో కొయ్య తగిలించే బట్టల నీడలో ఇలా ఎన్నో స్థలాలలో ఎన్నో రకాలుగా ఊహించని ఆకారాల్ని బొమ్మలుగా చూడగలిగే సహజ పరిజ్ఞానం ఉంటే బొమ్మలు వేయడానికి మనలో సగం జ్ఞానం ఉన్నట్లే. తప్పనిసరిగా కోరిక, తీరిక, ఓపిక వుంటే ఏ పనినైనా సాధించవచ్చు. వీటితోపాటు పెన్సిలు, రబ్బరు, రంగులు, కాగితాలు, బ్రష్ లు, నీళ్లు పెట్టుకున్నారు కదా..... మరి ఇంకెందుకాలస్యం ఈరోజ నుంచి అదేనండీ..... ఇప్పటి నుండే నేర్చుకుందాం.

మీరు ఇప్పుడు ప్రపంచభాష తెలుసుకోబోతున్నారు. నిజమే! ప్రపంచంలో ఒకరి భాష ఒకరికి అర్థం కాకపోయినా అర్థవంతంగా భావాన్ని చెప్పగలిగే భాషే ఈ చిత్రలేఖనం. మన చుట్టూ ఉన్న ప్రపంచంలోని ప్రతి వస్తువు ప్రక్కన ఉన్న ప్రధాన రూపాల నుండి ఉద్భవించినవే. భాషకు అక్షరాలే అవసరమైతే, బొమ్మలకు ఆకారాలే ఆధారం. "గుండ్రని ఆకారం" తో చక్రం పుట్టి మానవ చరిత్ర గమనాన్నే మార్చేసింది.

అంతే కాదు బొమ్మలు గీయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదివిన, విన్న విషయాలు సులభంగా అర్థం అవుతాయి. ప్రతి నెలా ఒక బొమ్మను సులభంగా ఎలా గీయాలో నేర్చుకుందాం....

**ఈ నెల బొమ్మ**



జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా

# స్పెషల్ స్టోరీ

జాతీయ బాలికా దినోత్సవం

बेटी बचाओ बेटी पढ़ाओ

బేటి బచావో బేటి పడావో లోగో

హాయ్ ఫ్రెండ్స్ !

**దేశంలో ఏదో ఒకచోట పసిమొగ్గలపై ఎన్నో లైంగిక దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇంటా, బయటా పిల్లలపై లైంగిక వేధింపులు, భౌతిక దాడులు పెరుగుతున్నాయి. దాంతో మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు మన జాతి సంపద. బాల్యంలోని మధురానుభూతులు అందించే వాతావరణం కల్పించాలి. అది జన్మహక్కు కూడా. పిల్లల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయి.**

## జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా .....

ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా జనవరి 24న నిర్వహించుకుంటారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు.

ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవంను ప్రారంభించడం జరిగింది.

## ప్రధాన లక్ష్యాలు:

- దేశంలో బాలికలు ఎదుర్కొంటున్న అన్ని అసమానతల గురించి ప్రజలలో అవగాహన కల్పించడం.
- ఆడపిల్లల హక్కుల గురించి అవగాహన కల్పించడం.
- బాలిక విద్య, ఆరోగ్యం మరియు పోషణ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం.

ఆడపిల్లలను కాపాడటం, పిల్లల లైంగిక నిష్పత్తులు, మరియు ఆడపిల్లలకు ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించడం వంటి అవగాహన కార్యక్రమాలతో సహా వివిధ కార్యక్రమాలను ఈ రోజున నిర్వహించడం జరుగుతుంది. 2019 లో, Empowering Girls for a Brighter Tomorrow' అనే ఇతివృత్తంతో దీనిని జరుపుకున్నారు

సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యల గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపుకుంటారు. బాలికల గురించి అసమానత్వం విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు చేస్తారు.

సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి జరుపుకుంటారు. సాధారణంగా అమ్మాయిల జీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సాంఘిక వివక్ష మరియు దోపిడీని తొలగించడం చాలా అవసరం. సమాజంలో మహిళల అవసరం గురించి అవగాహన పెంచడానికి, అమ్మాయిల కోసం వివిధ రాజకీయ మరియు కమ్యూనిటీ నాయకులు సమాన విద్య మరియు ప్రాథమిక స్వేచ్ఛ గురించి ప్రజలకు చెప్పడం జరుగుతుంది.

## పిల్లల ప్రధాన హక్కులు...

సంపూర్ణ ఆరోగ్యం,నాణ్యమైన ఉచిత విద్య,ఆడుకోవడం, వినోదం, పరిశుభ్రమైన తాగునీరు, పోషకాహారం, గౌరవం, సమానత్వం,భావ వ్యక్తీకరణ,సమాన విద్యావకాశాలు, స్వేచ్ఛగా ఆలోచించడం, మానసిక, శారీరక వేధింపుల నుంచి విముక్తి, ప్రేమ, ఆప్యాయతలు, సామాజిక భద్రత.

## ముఖ్య చట్టాలు...

**పోక్సో చట్టం- 2012 :** పద్దెనిమిదేళ్లలోపు పిల్లలపై లైం గిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయొచ్చు. నేరం రుజువైతే సాధారణ శిక్ష మొదలుకొని కఠిన కారాగార శిక్ష, జీవిత ఖైదు, మరణశిక్ష విధించొచ్చు. పన్నెండేళ్ల బాలికలపై అత్యాచారం చేసిన కేసులో ఉరిశిక్ష విధించేలా పోక్సో చట్టాన్ని సవరించారు.

**బాల్యవివాహాల నిరోధక చట్టం- 2006:** ఈ చట్టం ప్రకారం పద్దెనిమిదేళ్లలోపు బాలికలకు వివాహం చేయడం నేరం. బాల, బాలికలను వివాహం చేసుకున్న వ్యక్తులు.పెళ్లికి కారణమైన పెద్దలు, ఇరు కుటుంబ సభ్యులు ఈ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారు.

**బాలల న్యాయ పోషణ రక్షణ చట్టం- 2015 :** ఈ చట్టం ద్వారా బాలికలు అవసరమైన రక్షణ, వసతి పొందొచ్చు.

**న్యాయసేవాధికార చట్టం -1987 :** ఈ చట్టం ప్రకారం బాలబాలికలు న్యాయ సహాయం పొందటానికి అర్హులు.

**ఆర్టికల్-24 :** పద్నాలుగేళ్ల పిల్లలను కర్మాగారాల్లోకానీ, గనుల్లోకానీ, ఏ ఇతర అపాయకరమైన వృత్తుల్లో పని చేయిం చకూడదు.

**ఆర్టికల్-30:** పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో, గౌరవప్రదమైన, స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో,అభివృద్ధి చెందడానికి అవకాశాలు కల్పించాలి.

**ఆర్టికల్-45 :** బాలలకు ఉచిత నిర్బంధ విద్య

అంతేకాదు ..బాధిత పిల్లలు లేదా వారి తరఫున పెద్దలు ఎవరైనా 'నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్' వెబ్ సైట్ లో నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. నమోదైన ఫిర్యాదులపై దేశవ్యాప్తంగా ప్రత్యేక బృందాలు పని చేస్తాయి. బాలలు ఏ పరిస్థితుల్లో ఉన్నా దేశంలో ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఈ వెబ్సైట్ ఉపయోగపడుతుంది.

లైంగికదాడులకు గురవుతున్న బాలికలకు రక్షణ కల్పించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం పోక్సో (లైంగిక అత్యాచార ఘటనల నుంచి పిల్లలను రక్షించే చట్టం) చట్టంలో కీలక సవరణలు చేసింది. ముఖ్యంగా, 12 యేళ్లలోపు బాలికలపై అత్యాచారానికి పాల్పడేవారికి ఉరిశిక్ష లేదా చనిపోయేంత వరకు జైలుశిక్ష విధించేలా ఆర్డినెన్స్ ప్రవేశపెట్టగా, దీనికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా ఆమోదముద్ర వేశారు.

ఈ నేపథ్యంలో బాలురకూ రక్షణ కల్పించేలా పోక్సో చట్టానికి సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. బాలురపై లైంగిక వేధింపులను పట్టించుకోవడం లేదని నిర్మాత, సామాజిక కార్యకర్త ఇన్సియా దరివాలా ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదుకు మంత్రి మేనకా గాంధీ మద్దతు పలికారు. అందువల్ల త్వరలో ఈ చట్టానికి మరికొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.

CHILDLINE అంటే స్నేహపూర్వక 'దీదీ' లేదా సానుభూతిపరుడైన 'భయ్యా' అంటే దుర్బలమైన పిల్లల కోసం రోజులో 24 గంటలు, సంవత్సరంలో 365 రోజులు ఎల్లప్పుడూ ఉంటుంది.

భారతదేశం అంతటా లక్షలాది మంది పిల్లలకు ఆశలు కలిగించే ఫోన్ నంబర్ **"1098"**, చైల్డ్ లైన్ మన దేశపు మొదటి 24 గంటల సహాయం మరియు సహాయం అవసరమైన పిల్లలకు ఉచిత, అత్యవసర ఫోన్ సేవ.

మీకు సంబంధిత పెద్దలు లేదా పిల్లలు అయినా, మీరు ఈ సేవలను యాక్సెస్ చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 1098 ను డయల్ చేయవచ్చు. వీరు పిల్లల అత్యవసర అవసరాలకు ప్రతిస్పందించడమే కాకుండా, వారి దీర్ఘకాలిక సంరక్షణ మరియు పునరావాసం కోసం సేవలకు లింక్ చేస్తారు. అటువంటి కాల్స్ ద్వారా దేశవ్యాప్తంగా మూడు మిలియన్ల మంది పిల్లలను వీరు ఇప్పటివరకు చేరారు.

చైల్డ్లైన్ భారత ప్రభుత్వ, మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్జిఓలు, అంతర్జాతీయ సంస్థలు, కార్పొరేట్ రంగం, సంబంధిత వ్యక్తులు మరియు పిల్లలతో భాగస్వామ్యంతో కలిసి పనిచేసే వేదిక.

సాధారణంగా పిల్లలందరి హక్కుల పరిరక్షణ కోసం చైల్డ్ లైన్ పనిచేస్తుంది. కానీ దాని ప్రత్యేక దృష్టి సంరక్షణ మరియు రక్షణ అవసరమయ్యే పిల్లలందరిపైనే ఉంటుంది, ముఖ్యంగా ఎక్కువ హాని కలిగించే విభాగాలు, వీటిలో:

- వీధుల్లో ఒంటరిగా నివసిస్తున్న వీధి పిల్లలు మరియు యువత
- అసంఘటిత మరియు వ్యవస్థీకృత రంగాలలో పనిచేస్తున్న బాల కార్మికులు
- గృహ సహాయం, ముఖ్యంగా అమ్మాయిల కుటుంబ జీవనానికి సంబందించిన
- కుటుంబం, పాఠశాలలు లేదా సంస్థలలో శారీరక / లైంగిక / భావోద్వేగ దుర్వినియోగానికి గురైన పిల్లలు.
- భావోద్వేగ మద్దతు మరియు మార్గదర్శకత్వం అవసరమైన పిల్లలు
- వాణిజ్య సెక్స్ వర్కర్ల పిల్లలు
- మాంసం వ్యాపారం యొక్క పిల్లల బాధితులు
- పిల్లల అక్రమ రవాణా బాధితులు
- తల్లిదండ్రులు లేదా సంరక్షకులు వదిలిపెట్టిన పిల్లలు
- తప్పిపోయిన పిల్లలు
- పారిపోయిన పిల్లలు
- మాదకద్రవ్య దుర్వినియోగానికి గురైన పిల్లలు
- విభిన్న సామర్థ్యం ఉన్న పిల్లలు
- పిల్లలు చట్టానికి విరుద్ధంగా ఉన్నారు
- మానసికంగా సవాలు ఎదుర్కొంటున్న పిల్లలు
- HIV / AIDS సోకిన పిల్లలు
- సంఘర్షణ మరియు విపత్తుతో బాధపడుతున్న పిల్లలు
- పిల్లల రాజకీయ శరణార్థులు
- కుటుంబాలు సంక్షోభంలో ఉన్న పిల్లలు

సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలకు ఇది సహాయపడుతుంది. చైల్డ్‌లైన్ సంఖ్య - 1098. చైల్డ్‌లైన్‌కు నెలకు సగటున ఒక మిలియన్ కాల్స్ వస్తాయి మరియు CHILDLINE సంవత్సరానికి 300,00 మంది పిల్లలను రక్షిస్తుంది. భారతదేశం యొక్క 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశం ఐదు నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాలకార్మికులు 4.35 మిలియన్లకు పైగా ఉన్నారు.

**కాబట్టి మీరంతా చక్కగా వీటన్నింటి గురించి అవగాహన చేసుకొని మంచి భవిష్యత్తును పొందాలని ఆశిస్తూ.....**

మీ **ఆకు**

# ఈ నెలలో పుట్టిన నేను పెద్దయ్యాక....

హాయ్ ఫ్రెండ్స్! ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న మా విద్యార్థులు వారి మనోభావాలను ఈ శీర్షిక లో తెలియజేస్తారు. ముందుగా వీరికి జన్మదిన శుభాకాంక్షలు. ఐతే ప్రతి నెలా చాలా మంది పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటారు. కాబట్టి వారిలో క్రమం తప్పకుండా బడికి వచ్చే వాళ్ళకు, చదువులో చురుకుగా వుండే వాళ్ళకు, ఆటలలో పాల్గొనే వాళ్ళకు ముందు ప్రాధాన్యత వుంటుంది.



హాయ్ , నేను మా అమ్మ నాన్నలకు రుణపడి ఉంటాను. నేను బాగా చదివి **కలెక్టర్** అయ్యి, మా కుటుంబాన్ని బాగా చూసుకుంటాను.సమాజ సేవ చేస్తాను

**మీ స్నేహితుడు: వినయ్,7వ తరగతి.**

అందరికీ నమస్కారం, నేను ఈ భూమిపై జన్మించినందుకు మా పేరెంట్స్ కు నేను రుణపడి ఉన్నాను. వారి ఋణం తీర్చుకోవడానికి నేను బాగా చదువుకొని **ఆర్మీ** లో చేరి దేశ సేవ చేస్తూ, మా అమ్మకు ఎటువంటి కష్టం రాకుండా బాగా చూసుకుంటాను.

మీ **రాంబాబు , 10వ తరగతి**



హలో ఫ్రెండ్స్ అందరికీ నమస్కారం, మా అమ్మా నాన్నలకు ఎంతో రుణపడి ఉన్నాను. నేను పెద్దయ్యాక **డాక్టర్** అవుతాను. వారి కష్టాలను తీర్చాలని నా కోరిక. సమాజానికి సేవ చేస్తాను.

మీ **ఐశ్వర్య, 10వ తరగతి**





హాయ్ ఫ్రెండ్స్, నాకు జన్మనిచ్చినందుకు మా అమ్మా నాన్నలకు ఎంతో రుణపడి ఉన్నాను. నేను పెద్దయ్యాక **డాక్టర్** అయ్యి వారి కష్టాలను తీర్చాలని అనుకుంటున్నాను. పేద వారికి సేవ చేస్తాను.

మీ **శిరీష, 10వ తరగతి**



హాయ్ ఫ్రెండ్స్, మా అమ్మా నాన్నలకు ఎంతో రుణపడి ఉన్నాను. నాకు పెద్దయ్యాక **డాక్టర్** అవ్వాలి అని వుంది. అందుకోసం నేను బాగా చదవాలి. సమాజానికి సేవ చేస్తాను.

మీ **శిల్ప , 7వ తరగతి**

ఫ్రెండ్స్ అందరికీ నమస్కారం, మా అమ్మా నాన్నలకు ఎప్పటికీ కష్టపెట్టను. నేను పెద్దయ్యాక **టీచర్** అవ్వాలనుకుంటున్నాను. అమ్మ నాన్నల కష్టాలను తీర్చాలని నా కోరిక. విద్యాదానం చేస్తాను.

మీ **రేణుక, 8వ తరగతి**



హలో ఫ్రెండ్స్, మా అమ్మా ను ఎప్పటికీ కష్టపెట్టను. నేను పెద్దయ్యాక **టీచర్** అవ్వాలనుకుంటున్నాను. అమ్మ కష్టాలను తీర్చాలని నా కోరిక. సమాజ సేవ చేయాలని వుంది. అందరికీ చదువు నేర్పుతాను..

మీ **పావని, 7వ తరగతి**





# ఇంగ్లీషులో మాట్లాడదాం రండి



G.SRINU, SA
ZPSS RAJESWARAPURAM

హాయ్ ఫ్రెండ్స్!

ఆంగ్ల మాధ్యమం లో చదివే పిల్లలు ఆంగ్లాన్ని స్కూల్ లోనే నేర్చుకొంటారు. మనం వారితో ఇంట్లో తెలుగు లోనే మాట్లాడుతున్నాం. పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడకపోవడానికి ఇది ఒక కారణం. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం. ఈ నాలుగు ప్రక్రియల ద్వారా మాత్రమే ఒక భాష ను నేర్చుకోగలం. మన స్కూల్స్ లో దీన్ని తలకిందులు చేసి.... అంటే ముందుగా రాయడం తో ఇంగ్లీష్ భాష నేర్పుతారు . అందుకే పిల్లలు సరిగా ఇంగ్లీష్ నేర్చుకోరు. అదేంటి అంటే "మీరు ఇంట్లో కూడా ఇంగ్లీష్ లో మాట్లాడితేనే పిల్లలకు ఇంగ్లీష్ వస్తుంది" అంటారు. అలాంటి గురువులకు ఇలా చెప్పాలి, "తల్లి పిల్లలకు భాష నేర్పించినట్టే, అంటే పిల్లలతో చిన్న చిన్న మాటలతో మాట్లాడడం...... వారు దాన్ని తిరిగి చెప్పేలా చెయ్యడం......భాషా బోధన ఇలా జరగాలి అని."

ఇకపోతే మనం ఇపుడు పైన చెప్పినట్లుగా ముందుగా వినడం, మాట్లాడడం,చదవడం, రాయడం క్రమంలో వెళదాం. మరి మొదటిది వినడం అన్నారు గదా! వినడానికి ఆడియో ఇవ్వకుండా రాసిస్తే ఎలాగా అనుకోకండి. ఆడియో ఇక్కడ ఇవ్వలేం కదా! క్రింద ఇచ్చినవి మీ ప్రక్కన ఇంగ్లీష్ వచ్చిన వారిని చెప్పమనండి, మీరు వినండి, తిరిగి వారితో మాట్లాడండి, ఆ తర్వాత చదవండి, రాయండి. అంతే సింపుల్ గా ఇంగ్లీష్ లో మాట్లాడటం అలవాటు అవుతుంది. చేస్తారు కదూ......................

(గత సంచిక తరువాయి) బొమ్మలతో మొదలుపెట్టాను. బొమ్మలే మీకు చాలా నేర్పిఉంటాయి. ఆ సంభాషణ కొనసాగిద్దాం........






దీనిని మీరు ప్రాక్టీస్ చేయండి......

వచ్చే నెలలో మళ్ళీ కలుద్దాం.... మీ శ్రీను

## అక్షరాలతో బొమ్మలు గీద్దాం...

ఈ శీర్షికలో ఆంగ్ల అక్షరాలతో బొమ్మలను ఎలా గీయవచ్చో నేర్చుకుందాం. రెండు రాష్ట్రాలలోని విద్యార్థులెవరైనా పంపవచ్చు. బావుంటే ప్రచురిస్తాం. త్వరగా పంపండి. ఈరోజు "D" తో బొమ్మ ఎలా గీయ వచ్చో చూద్దాం....





# కవితలు రాద్దాం రండి.......



**హాయ్ ఫ్రెండ్స్,**

పిల్లలకు భాషా మాధుర్యాన్ని తెలపాలని, వారిలో భాషా నైపుణ్యాన్ని పెంచాలని, భాష పట్ల అభిరుచి పెంచాలని ఈ శీర్షికను ప్రారంభిస్తున్నాం. ఇందులో పిల్లలు మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రాసిన కవితలను ప్రచురించడం జరుగుతుంది. ముఖ్యంగా పిల్లలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. మొదటి సంచిక కాబట్టి ఉపాధ్యాయులవే ఎక్కువగా ఇవ్వడం జరిగింది.

## నూతన సంవత్సర శుభాకాంక్షలతో



జీవితం
చెట్టులా మారాక
ఆయువు పత్రహరితమౌతుంది
వచ్చిపోయే వసంతాల నడుమ
ఆశ కొత్త చిగుళ్ళను తొడుగుతుంది.

నిన్నటి వరకూ
పొదవి పట్టుకొని కాపాడిన మాసాలు
రెక్కలు తొడిగి అనంత ఆకాశంలోకి
ఎగిరిపోయాయి.

కలలు కనుగుడ్లు పగిలి
దారిపొడుగునా  కన్నీరొలికిన
ప్రవంతి పరీవాహక ఉప్పు చారికలైనాయి

ఏమో...
కాలం ఎవరికెన్ని సంవత్సరాలు వీలునామా
రాస్తుందో... ఎప్పుడు ఎవరి చేతిలో కలల
పరిమళ సుమ దళ బొకేలు పెడుతుందో...

డైరీ పుటల నడుమ రేపటి భవిత కొంగ్రొత్త
రంగుల రోజుల రోజాలను స్వప్నిస్తూ..
తెల్లరేకై పల్లవిస్తుంది.

రండి
శుభాకాంక్షలతో పలకరించుకుందాం
కేలండర్ల తో పూల బొకేలతో
పరస్పరం నూతనంగా కౌగిలించుకుందాం
ఆత్మీయంగా కాలానికి అల్లుకుపోదాం

జీవితం
ఖడ్గచాలనమైనా కాలంతో విర్నవ్వుల
కరచాలనం చేద్దాం
(  నూతన సంవత్సరం సందర్భంగా )

మీ -  గరికపాటి మణీందర్



## నీవే నీ తలరాతకు సృష్టికర్తవు ..

ఓ!ప్రియ శిష్యా.....
ఈ నూతన వత్సరంలో ....
ఆలోచనతో నడుచుకో
ఆత్మవిశ్వాసం పెంచుకో
గురుభక్తిని చాటుకో
ఆత్మవిమర్శ చేసుకో
నీ ప్రవర్తనను పరీక్షించుకో
నిన్ను నువ్వే బాగు చేసుకో
నీవే నీ విధి రాతకు కర్తవు...
నీవే నీ తలరాతకు సృష్టి కర్తవు

మీ  -  ఆకు(ఆదిత్య కుమార్)



స్వాగతం
అవును
కాలచక్రం
గిర్రునతిరిగింది
వెనక్కి తిరిగి
చూసుకునేలోపే
జ్ఞాపకాలన్నీ
మూటగట్టుకొని
పాత ఏడాది
పరుగులు పెడుతోంది
కొత్త ఏడాదికి
అవకాశమిస్తూ
సాదరంగా ఆహ్వానిస్తూ...

-  గుముడాల చక్రవర్తి గౌడ్



## మానవత్వం మంటగలిసిన వేళ

(మానవ మృగాల చేత ఆగమైన ప్రతి ఆడబిడ్డకి అశ్రునయనాలతో శ్రద్ధాంజలి  ఘటిస్తూ)

తిరిగిరాని లోకాలకు తరలిపోతివా తల్లి
మానవ మృగాలు నిన్ను మట్టుబెట్టెనా చెల్లి
ఏ పాపము చేసావని ఎందుకు ఈ దుర్గతి
తమ్ముళ్లని నమ్మి నీవు బూడిదైనావా వల్లి
"తిరిగిరాని"
నీచమైన మనసుతో పశువులుగా మారారా
తమకంటె పెద్దవారిని తల్లియని మరిచారా
ఏదేవుడు లేడేమో ఈ క్రూరుల బుద్ధిమార్చ
మానవతే! కరువాయె నినుకాటికి పంపువేళ
"తిరిగిరాని"
తనువును దోచుకుని మసిబొగ్గును చేసారా!
మానవీయ విలువల్లి ఆసాంతం మరిచారా!
కన్నవారి దుఃఖమును ఆపెదెల నీచులారా!
మీ పాపాలు పండే సమయం రానుందిరా!
"తిరిగిరాని"
మనుషులా మీరసలు ఓ మానవ మృగాళ్ళారా
మిమ్ము కన్న తల్లికూడా ఆడదని మరిచారా!
మీ అక్కాచెల్లెళ్లు కూడా స్త్రీలేకదా మరిచారా!
స్త్రీమూర్తిలో దైవాన్ని చూడలేని నీచులారా!
"తిరిగిరాని"
మీ పాపం పండేరోజు త్వరలోనే రానుందిరా
మీఆగడాలకు ముగింపు పలికే
క్షణముందిరా!
మారండి ఇకనైనా ఓ మానవ మృగాల్లార!
మనుషులుగా మారండి లేదా మట్టి
గొట్టుకుపోతారురా!
"తిరిగిరాని"

మీ -  కొత్త శంకర్ రెడ్డి



# పదాలు పలుకుదాం ఇలా...




K.SHANKAR REDDY, SA
ZPSS RAJESWARAPURAM


హాయ్ ఫ్రెండ్స్ ,

ఇంగ్లీష్ చదవడం వచ్చిన పిల్లలు వాటిని పలకడంలో తప్పులు చేస్తుంటారు. దానికి కారణం వాటిని పలకడం లో మెళుకువ తెలియక పోవడమే. ఈ శీర్షికలో మనం వాటి గురించి ప్రతి నెలా కొంత నేర్చుకుందాం........

ముఖ్యంగా ఇంగ్లీష్ పలికే ధ్వనులకు సంబంధించి PHONEME మరియు GRAPHEME అని రెండు పదాలుంటాయి. PHONEME అంటే SPEECH SOUND మరియు GRAPHEME అనగా WRITTEN REPRESENTATION OF SOUND. సాధారణంగా ఇంగ్లీష్ లో పలకడానికి మొత్తం దాదాపు 44 శబ్ధాలున్నాయి. తిరిగి వాటిని రెండు రకాలుగా విభజించవచ్చు. హల్లుల శబ్ధం, అచ్చుల శబ్ధం. గత నెలలలో మనం హల్లులకి సంబంధించిన సౌండ్స్, అచ్చులకు సంబంధించినవి కొన్ని చూశాం ....

అక్షరాలను పలికేటపుడు పెదాలు ఎలా కదిలించాలో బొమ్మల ద్వారా చూద్దాం.....





మీ - శంకర్ రెడ్డి



# కథ చెప్పుతా..ఊ కొడతావా.....



మిత్రులారా! ఈ రోజుల్లో కథలు చెప్పేవారూ, వినేవారూ చాలా చాలా తక్కువైనారు. ముఖ్యంగా పిల్లలలో పఠనాశక్తి పెంచేందుకు కథలు ఎంతగానో ఉపయోగపడతాయని మా అభిప్రాయం. అందుకే ఈ శీర్షికలో పిల్లలు సొంతంగా రాసిన కథలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. తర్వాత సేకరించిన వాటికి ప్రాధాన్యం. ఐతే అవి సందేశాత్మకంగా గానీ, నీతి ప్రాధాన్యం కలవి గానీ అయి ఉండాలి.

**ఈ నెల కథ ......**

## నలుగురు స్నేహితులు



ఒక కాలేజ్ లో నలుగురు స్నేహితులున్నారు. వాళ్లకి చదువు అంటే ఇష్టం లేదు. సరిగ్గా పరీక్షల ముందు రాత్రంతా పార్టీ కెళ్ళి, మర్నాడు పరీక్షరాయకుండా, తిన్నగా కాలేజ్ పెద్ద దగ్గరకెళ్ళి, "నిన్న రాత్రి ఒక పెళ్ళికి వెళ్లి తిరిగి వస్తుంటే, కార్ టైరు పంచరైంది. దానిని తోసుకుంటూ వచ్చేసరికి బాగా అలిసి పోయాము, ఇప్పుడు పరీక్ష రాసే ఓపిక లేదు" అని ఒక కథ కల్పించి చెప్పారు.

కాలేజ్ పెద్ద, "సరే, పరీక్ష వచ్చేవారంలో రాయమని చెప్పాడు. వీళ్ళు నలుగురు మోసం కబుర్లతో ఆయనని బోల్తా కొట్టించామనుకుని తెగ సంతోషించారు.

తరువాత వారం పరీక్షకి సిద్ధం అయి వచ్చారు. వాళ్ళ నలుగురిని విడి విడి క్లాసుల్లో కూర్చోమని వాళ్లకి ఒకటే ప్రశ్న పత్రం ఇచ్చారు. అందులో రెండే రెండు ప్రశ్నలున్నాయి 100 మార్కులకి:

1. నీపేరు:
2. ఏ టైరు పంక్చర్ అయింది?

దీనికి, ఒక్కో స్నేహితుడు ఒక్కో సమాధానం ఇలా రాసారు: 1. కుడి వైపు టైరు 2. ఎడమ వైపు టైరు 3. వెనుక కుడి టైరు 4. వెనుక ఎడమ టైరు.

నీతి: నీకు నువ్వు చాలా తెలివైనవాడివనుకోవచ్చు ...కానీ నిన్ను మించిన వాళ్ళు ఉంటారు.

**సేకరణ: శిరీష, 10వ తరగతి.**

మన జాతీయ భాష అయిన హిందీ ని మనం తప్పనిసరిగా నేర్చుకోవాలి. అప్పుడే మనం ఈ దేశంలో ఏ మూలకు వెళ్ళినా బ్రతకగలం. కనీసం రోజుకు రెండు మూడు పదాలైనా నేర్చుకోవాలి. అందులో భాగంగా జోక్స్ తో ప్రారంభిద్దామని అనుకున్నాను. వీటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి.

## हिन्दी चुटकुले



1. पप्पू : मां सारे खिलौने बेड के नीचे छिपा दो...
   पप्पू की मां : क्यों..?
   पप्पू : क्योंकि मेरा दोस्त डब्बू आ रहा है..
   पप्पू की मां : डब्बू खिलौने चुरा लेगा क्या...?
   पप्पू : नहीं, वह अपने खिलौने पहचान लेगा..


**वाणी कुमारी, यस.ए.**
**जि.प.उ.पा.राजेश्वरापुरम**



# స్టూడెంట్ కార్నర్



హలో ఫ్రెండ్స్,

పిల్లలు తమ అభిప్రాయాలను నేరుగా చెప్పలేకపోవచ్చు. అలాగే కొందరు వారి అభిప్రాయాలకు ఇతరుల స్పందన ఎలా ఉంటుందో అని ఆలోచించే వారు ఉంటారు. ఈ శీర్షిక ద్వారా పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలుపగలరని మా నమ్మకం. అంతేకాక వారిలో తప్పులులేకుండా రాయాలనే జ్ఞానం పెరుగుతుంది.

## ఇతర జిల్లాల వారి స్పందన



హలో ఫ్రెండ్స్,

ప్రతినెలా విడుదలౌతున్న "మాబడి" పత్రిక అంటే నాకు చాలా ఇష్టం. ప్రతి నెలా మా మేడం ని అడుగుతున్నా పత్రిక ఎప్పుడొస్తుందా అని. అందులో అన్ని సబ్జెక్టుల విషయాలు ఉంటున్నాయి. నేను కూడా పత్రికకు ఏదో ఒకటి రాసి పంపుతాను. తప్పకుండా వేస్తారని ఆశిస్తున్నాను. ఈ పత్రికకోసం కృషి చేస్తున్న వారందరికీ కృతజ్ఞతలు.

- వెంకటేష్, 8 EM.ZPHS రేవూరు,నెల్లూరు జిల్లా.



హాయ్,

'మాబడి' పత్రికలో నాకు బొమ్మలు బాగా నచ్చాయి. కథ నేను కూడా రాస్తాను. హిందీలో జోకులు కూడా నాకు అర్థం కాలేదు. అలాగే ఈసారి నేను బొమ్మలు కూడా వేస్తాను. నా బొమ్మ వచ్చినప్పుడల్లా మా అమ్మ నాన్నలు చాలా సంతోషపడుతున్నారు.

- ఆకాష్ , 6వ తరగతి.



హాయ్ ఫ్రెండ్స్,

డిసెంబర్ మాసపత్రిక "మాబడి"లో నా ఫోటో చూసేసరికి నాకు చాలా సంతోషం వేసింది. కానీ నేను పత్రికను పూర్తిగా చదవలేక పోయాను. చదివిన దానిలో వింత ప్రపంచం బాగా నచ్చింది. పిల్లిని మేయర్ గా ఎలా వుంచారో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. అలాగే బొమ్మలు చాలా బాగా వేసారు.నేను కూడా పుస్తకం కోసం ఏదో ఒకటి రాయడానికి ప్రయత్నిస్తాను.

- సంగీత , 8వ తరగతి.



ఫ్రెండ్స్,

డిసెంబర్ "మాబడి" పత్రికలో నాకు కథ, బొమ్మలు, పజిల్ మొదలైనవి నచ్చాయి. నేను ప్రతి నెలా చదువుతున్నాను. నాకు ఎన్నో తెలియని విషయాలు ఉంటున్నాయి.వేరే జిల్లా వారు కూడా ఇందులో ఏదో ఒకటి రాయడం నాకు బాగా నచ్చింది. అందరూ దీన్ని చదవాలి

- ఉదయ్ కిరణ్ ,10వ తరగతి



హలో ఫ్రెండ్స్,

డిసెంబర్ నెల "మాబడి" మాసపత్రికలో నా ఫోటో వచ్చింది. నేను తప్పకుండా బాగా చదివి డాక్టర్ ని అవుతాను. ఇలా ఇవ్వడం నాకు బాగా నచ్చింది. నేను పత్రిక కోసం ఎదురుచూస్తుంటాను. చాలా చాలా బావుంది. మీరందరూ చదవండి.

- యోగేందర్, 8వ తరగతి.



మై డియర్ ఫ్రెండ్స్,

నేను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా వుంది. ఈ విషయాన్ని పత్రికలో ఇస్తున్నందుకు నేను గర్వంగా ఫీల్ అవుతున్నాను. పత్రికలో ఇవ్వడం వలన మరికొంత మందికి ప్రేరణ కల్గుతుందని నా అభిప్రాయం. మీరూ చదవండి.

- యమున, 9వ తరగతి.

ఈ నెలలో ఈ పుస్తకం పై అభిప్రాయాలు చెప్పారు. ఇపుడిపుడే వారు వారి అభిప్రాయాలు చెప్పడానికి అలవాటు పడుతున్నారు. దయచేసి అందరూ సహృదయంతో గమనించగలరు.

**శుభవార్త:** ప్రతి నెలా 'గెస్ట్ కాలం' శీర్షిక కు మీరూ రచనలు పంపవచ్చు. త్వరపడండి. టీచర్లు, విద్యార్థులూ రచనలు పంపవచ్చు.

ప్రతి నెలా ఒకటి టీచర్ ది, మరొకటి విద్యార్థిది తప్పక వుంటుంది.